# దిన పత్రిక తొలి సమయం

వాస్తవమే గమ్యం! గమనం!!

సంపుటి: 3 | సంచిక : 243 | బుధవారం 09. 9. 2026 | ఎడిటర్ వేముల అయోధ్య రాములు | పేజీలు 4 | వెల: 5.00


## విద్యార్థులకు దుస్తుల పంపిణీ

**తొలి సమయం, ఇల్లందు;సెప్టెంబర్, 08:**
ఇల్లందు మండలం, సుధమల్ల పాఠశాలలో విద్యార్థులకు సర్పంచ్ కుంజ సుకనయ్య చేతుల మీదుగా దుస్తులు పంపిణీ చేశారు. విద్యార్థుల పట్ల చూపిన ఆదరణకు పాఠశాల యాజమాన్యం ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపింది.



## కాంగ్రెస్, బీఆర్ఎస్‌లది 'కాంప్రమైజ్ పాలిటిక్స్'

- ఇరు పార్టీలు ప్రజా సమస్యలను గాలికొదిలేసి రాజకీయ డ్రామాలు
- అసెంబ్లీలో జరుగుతున్న పరిణామాలను చూసి రాష్ట్ర ప్రజలు అసహ్యించుకుంటున్నారు.
- 'నువ్వు కొట్టినట్లు చేయ్.. నేను ఏడ్చినట్లు చేస్తా' అన్న చందంగా వ్యవహరిస్తున్నారు.



తెలంగాణ శాసనసభ సమావేశాల తీరు, అధికార కాంగ్రెస్ , ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ పార్టీల వ్యవహార శైలిపై కేంద్ర మంత్రి బండి సంజయ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఇవాళ బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇరు పార్టీలు ప్రజా సమస్యలను గాలికొదిలేసి రాజకీయ డ్రామాలతో ప్రజలను మోసం చేస్తున్నాయని మండిపడ్డారు. అసెంబ్లీలో జరుగుతున్న పరిణామాలను చూసి రాష్ట్ర ప్రజలు అసహ్యించుకుంటున్నారని, నేతల బజారు భాష చూసి నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. 'నువ్వు కొట్టినట్లు చేయ్.. నేను ఏడ్చినట్లు చేస్తా' అన్న చందంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు లాలూచీ రాజకీయాలు చేస్తూ ప్రజలను పిచ్చోళ్లను చేస్తున్నారని బండి సంజయ్ ఆరోపించారు.

## 22Aపై చర్చకు బీజేపీ సభ్యుల పట్టు..

తెలంగాణ శాసనసభ రెండో రోజు సమావేశాలు తీవ్ర గందరగోళం, వాడీవేడి చర్చల మధ్య ప్రారంభమయ్యాయి. శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు నవీన్ కుమార్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యల అంశం సభలో ప్రధాన చర్చనీయాంశమైంది. స్పీకర్‌ను అవమానించేలా ప్రవర్తించిన ఆ ఇద్దరు ఎమ్మెల్సీలపై సభలో కఠిన చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం తీర్మానం ప్రవేశపెట్టనుంది. ఇక సభా నిర్వహణ సజావుగా సాగేందుకు వీలుగా ప్యానెల్ స్పీకర్లను నియమించారు. కడియం శ్రీహరి, బాలునాయక్, కూనంనేని సాంబశివరావు, కౌసర్‌లను ప్యానెల్ స్పీకర్లుగా ప్రకటించారు. అనంతరం ప్యానెల్ స్పీకర్ స్థానాన్ని అధిష్టించి సభా కార్యక్రమాలను కొనసాగించారు. సభలో స్పీకర్‌కు జరిగిన అవమానంపై ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి మాట్లాడిన అనంతరం, రాష్ట్రంలో తీవ్ర వివాదాస్పదంగా మారిన '22ఏ' నిషేధిత భూముల జాబితా చట్టంపై సభలో తక్షణమే చర్చ చేపట్టాలని బీజేపీ సభ్యులు పట్టుబట్టారు. ఈ సందర్భంగా బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై చర్చించకుండా సభకు పదేపదే విరామాలు ఇస్తున్నారని మండిపడ్డారు. స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యల అంశంపై ఇప్పటికే సభలో చర్చించామని, ప్రజాప్రయోజనాలతో ముడిపడి ఉన్న 22ఏ అంశంపై ఎప్పుడు చర్చిస్తారో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.

## అర్హత లేని టీచర్ల నియామకం చెల్లదు

**తొలి సమయం హైదరాబాద్**



దేశంలో ఉపాధ్యాయుల నియామకాలు, సర్దుబాటు ప్రక్రియపై దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు సంచలన తీర్పును వెలువరించింది. అర్హత లేని వ్యక్తులను స్కూళ్లు, కాలేజీల్లో టీచర్లు, ట్యూటర్లుగా నియమించడాన్ని ధర్మాసనం తీవ్రంగా తప్పుబట్టింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మల్య బాగ్చి, జస్టిస్ మోహనాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. విద్యా హక్కు చట్టం , నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్), యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నిబంధనల ప్రకారం నిర్దేశిత కనీస అర్హతలు, టెట్ , నెట్ (చీజు) లాంటి అర్హత పరీక్షలు పాస్ కాని వారిని ఏ విద్యా సంస్థలోనూ ఉపాధ్యాయులుగా నియమించడానికి వీలేదని స్పష్టం చేసింది.

## దేశంలో బొగ్గు కొరత భయం లేదు..

### కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి తొలి




**సమయం హైదరాబాద్**
వర్షాకాలం కారణంగా బొగ్గు ఉత్పత్తిలో కొద్దిరోజుల పాటు స్వల్ప అంతరాయం ఏర్పడినా, ప్రస్తుతం దేశంలో ఎలాంటి కొరత లేదని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. ఇవాళ ఆయన ఢిల్లీలో జాతీయ మీడియాతో మాట్లాడుతూ.. బొగ్గు నిల్వలు, విద్యుత్ ఉత్పత్తికి సంబంధించిన అంశాలపై క్లారిటీ ఇచ్చారు. దేశవ్యాప్తంగా ప్రస్తుతం సుమారు 123 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు అందుబాటులో ఉన్నాయని కిషన్‌రెడ్డి తెలిపారు. ఇది దేశానికి దాదాపు 51 రోజులకు సరిపడా నిల్వలు అని, విద్యుత్ ప్లాంట్లు, ఉత్పత్తి కంపెనీల వద్ద కూడా సుమారు 23 రోజులకు సరిపడా బొగ్గు నిల్వలు ఉన్నాయని పేర్కొన్నారు.వర్షాలు తగ్గుముఖం పట్టడంతో గత రెండు, మూడు రోజులుగా బొగ్గు ఉత్పత్తి గరిష్ట స్థాయికి చేరిందని మంత్రి కిషన్ రెడ్డి వెల్లడించారు. బొగ్గు, రైల్వే, విద్యుత్ శాఖలు సమన్వయంతో ఉదయం నుంచి రాత్రి వరకు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నాయని తెలిపారు.

## మోదీ హాజరయ్యే సదస్సు.. PMO ఫేక్ ఐడీ, తుపాకీ కలకలం

ముంబయిలో ప్రధాని మోదీ పాల్గొనాల్సిన ఓ కార్యక్రమంలో భద్రతా సమస్య ఎదురైంది. కొన్ని గంటల ముందే సభా ప్రాంగణంలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించిన ఇద్దరు వ్యక్తులను ముంబయి పోలీసులు అరెస్టు చేశారు. అనుమానితుడి వద్ద ప్రధానమంత్రి కార్యాలయం పేరుతో ఫేక్ ఐడీ కార్డు, అతడి బాడీగార్డ్‌గా పేర్కొన్న మరో వ్యక్తి వద్ద తుపాకీని స్వాధీనం చేసుకున్నారు. విషయం తీవ్రత దృష్ట్యా.. ముంబయి క్రైమ్ బ్రాంచ్ పోలీసులు ఈ కేసు దర్యాప్తు బాధ్యతను చేపట్టారు. ప్రస్తుతం ఆ ఇద్దరినీ విచారిస్తున్నారు. ముంబయిలోని బాంద్రా- కుర్లా కాంప్లెక్స్‌లోని నీతా ముఖేష్ అంబానీ కల్చరల్ సెంటర్‌లో గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ కార్యక్రమం జరగనుంది. నాలుగు రోజుల పాటు జరగనున్న ఈ సదస్సును ప్రధాని మోదీ మంగళవారం సాయంత్రం ప్రారంభించనున్నారు. ఈ క్రమంలో వేదిక సమీపంలో తనిఖీలు చేస్తున్న పోలీసులకు ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు.

# ఎర్రవల్లిలో తీవ్ర ఉద్రిక్తత

- కేసీఆర్ ఫామ్‌హౌస్ వద్ద డప్పుల మోతకు కాంగ్రెస్ పార్టీ పిలుపు
- కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలి వచ్చి డప్పులు మోగిస్తూ నిరసన
- ఫామ్‌హౌస్ సమీపంలోకి కాంగ్రెస్ కార్యకర్తలు దూసుకెళ్లారు.
- ఎక్కిడికక్కడ కాంగ్రెస్ శ్రేణులను బారికేడ్లు, రోప్ పార్టీతో పోలీసులు నిలువరించారు.
- దీంతో పోలీసులు, ఆందోళనకారులకు మధ్య తోపులాట
- పోలీసులు స్పందించి వెంటనే నిరసనకారులను వెనక్కి తీసుకొచ్చారు.
- ఆందోళనకారులను అదుపు చేసే క్రమంలో పలువురు పోలీసులకు స్వల్ప గాయాలయ్యాయి.
- ఎర్రవల్లికి బయల్దేరిన కేటీఆర్, హరీశ్‌రావు అరెస్ట్
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అరెస్ట్ చేసి జవహర్‌నగర్, బోయిన్‌పల్లి పీఎస్‌లకు తరలించారు.



**తొలి సమయం హైదరాబాద్**
ఎర్రవల్లి: సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలో తీవ్ర ద్రిక్తత నెలకొంది. కేసీఆర్ ఫామ్‌హౌస్ వద్ద డప్పుల మోతకు కాంగ్రెస్ పార్టీ పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలి వచ్చి డప్పులు మోగిస్తూ నిరసన తెలిపేందుకు ప్రయత్నించారు. నర్సారెడ్డి ఆధ్వర్యంలో వరద ́రాజ పూర్‌మీదుగా కేసీఆర్ ఫామ్‌హౌస్ సమీపంలోకి కాంగ్రెస్ కార్యకర్తలు దూసుకెళ్లారు. ఎక్కిడికక్కడ కాంగ్రెస్ శ్రేణులను బారికేడ్లు, రోప్ పార్టీతో పోలీసులు నిలువరించారు. దీంతో పోలీసులు, ఆందోళన కారులకు మధ్య తోపులాట జరిగింది. కొందరు కార్యకర్తలు బారికేడ్లను తోసుకుని కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు అర కిలోమీటరు దగ్గర్లోకి వెళ్లి డప్పుల మోతతో నిరసన తెలిపారు. పోలీసులు స్పందించి వెంటనే నిరసనకారులను వెనక్కి తీసుకొచ్చారు. ఆందోళనకారులను అదుపు చేసే క్రమంలో పలువురు పోలీసులకు స్వల్ప గాయాలయ్యాయి. ఒక దశలో డీసీసీ అధ్యక్షురాలు ఆంక్షారెడ్డి బారికేడ్లు తోసుకుని ఫాంహౌస్ వైపునకు పరుగులు తీశారు. మరో వైపు మర్కుక్ వద్ద బీఆర్ఎస్ శ్రేణులు మోహరించాయి. ఫాం హౌస్ సమీపంలో రైతు దీక్ష పేరుతో బీఆర్ఎస్ కార్యకర్తలు ఆందోళనకు దిగారు.

## ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డిపై సస్పెన్షన్ వేటు

- శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై అనుచిత వ్యాఖ్యల వ్యవహారంలో చర్యలు
- ఇద్దరినీ సస్పెండ్ చేయాలని శాసనమండలిలో మంత్రి శ్రీధర్‌బాబు తీర్మానం
- మూజువాణి పద్ధతిలో ఓటింగ్ నిర్వహించిన ఛైర్మన్..
- సెషన్ మొత్తానికి ఇద్దరు ఎమ్మెల్సీలను సస్పెండ్ చేసినట్లు ప్రకటన
- మంత్రి దామోదర రాజనర్సింహ ఈ మేరకు సభలో తీర్మానం
- "స్పీకర్‌పై తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డి దూషణలను సభ తీవ్రంగా ఖండిస్తోంది.
- సభామర్యాదలకు విరుద్ధమైన వ్యాఖ్యలపై నిరసన తెలుపుతోంది.



**తొలి సమయం హైదరాబాద్**
శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యల వ్యవహారంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డిపై మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సస్పెన్షన్ వేటు వేశారు. ఇద్దరినీ సస్పెండ్ చేయాలని శాసన మండలిలో మంత్రి శ్రీధర్‌బాబు తీర్మానం ప్రవేశపెట్టారు. దీనిపై మూజువాణి పద్ధతిలో ఓటింగ్ నిర్వహించిన ఛైర్మన్.. సెషన్ మొత్తానికి ఇద్దరు ఎమ్మెల్సీలను సస్పెండ్ చేసినట్లు ప్రకటించారు. అనంతరం మండలి వాయిదా పడింది.అంతకుముందు శాసనసభ కూడా తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డిలపై చర్యలు తీసుకోవాలని తీర్మానించింది. మంత్రి దామోదర రాజనర్సింహ ఈ మేరకు సభలో తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. "స్పీకర్‌పై తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డి దూషణలను సభ తీవ్రంగా ఖండిస్తోంది. సభామర్యాదలకు విరుద్ధమైన వ్యాఖ్యలపై నిరసన తెలుపుతోంది. మహిళల ఎదుట అసభ్యకరంగా ప్రవర్తించడాన్ని ఖండిస్తోంది. బీఆర్ఎస్ సభ్యుల అనుచిత ప్రవర్తలను ఆ పార్టీ అధినేత కేసీఆర్ బాధ్యత తీసుకోవాలి. శాసనసభాపతికి కేసీఆర్ బేషరతుగా క్షమాపణ చెప్పాలి. నిబంధనలకు అనుగుణంగా మండలి ఛైర్మన్ చర్యలు తీసుకోవాలి" అని శాసనసభ తీర్మానించింది.

## బోయిన్‌పల్లి పీఎస్ వద్ద ఉద్రిక్తత



కంటోన్మెంట్: బోయిన్‌పల్లి పీఎస్ వద్ద ఉద్రిక్తత నెలకొంది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎర్రవల్లికి వెళ్తుండగా.. హకీంపేట వద్ద పోలీసులు ఆయన్ను అదుపులోకి తీసుకుని పీఎస్‌కు తరలించారు. ఈ విషయం తెలుసుకుని బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకున్నాయి. అదే సమయంలో కాంగ్రెస్ శ్రేణులు కూడా అక్కడికి రావడంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. పీఎస్ ముందే బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తలు పరస్పరం దాడికి పాల్పడ్డారు. రాళ్లు, కుర్చీలు విసురుకున్నారు. పోలీసులు రంగంలోకి దిగి ఇరువర్గాలను చెదరగొట్టారు. అనంతరం బీఆర్ఎస్ నాయకులు ఎన్‌హెచ్-44పై బైఠాయించి నిరసన తెలిపారు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది.

## ఐఏఎస్ నవీన్ మిట్టల్ పీఎస్ రాజు మృతి

- తెలంగాణ శాసనసభ ఆవరణలో తీవ్ర విషాదం
- అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో మంగళవారం విధులకు హాజరైన రాజు,
- ఆవరణలో ఉన్న సమయంలో ఒక్కసారిగా తీవ్ర అస్వస్థత
- ఆ సమయంలో అక్కడే ఉన్న మంత్రి వాకిటి శ్రీహరి తక్షణమే స్పందించి, ఆయనకు ప్రాథమిక చికిత్సగా సీపీఆర్
- అనంతరం రాజును మెరుగైన వైద్య చికిత్స కోసం వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించారు.
- అయితే, ఆస్పత్రికి చేరుకునేలోపే ఆయన మృతి చెందినట్లు పరీక్షించిన వైద్యులు నిర్ధారించారు.



## సెప్టెంబరు 11న మోదీ-పుతిన్ భేటీ

- ఈ నెల 12-13 తేదీలలో ఢిల్లీలో భారత్ అధ్యక్షతన 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం
- ఆ సమావేశానికి ముందు ఇరువురు దేశాధినేతలు ద్వైపాక్షిక చర్చ
- ఇరుదేశాల నేతలు ద్వైపాక్షిక సమావేశంలో వాణిజ్యం, ఆర్థిక సంబంధాలకు పెద్దపీట
- ఉక్రెయిన్‌తో యుద్ధం, గల్ఫ్ ఉద్రిక్తతలు, ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై దాని ప్రభావం వంటి విషయాలపైనా చర్చలు జరిపే అవకాశం



# కేసీఆర్ హత్యకు కుట్ర

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- ఫాంహౌస్ కు వెళ్తున్న తమను అరెస్ట్ చేసి బోయిన్ పల్లి పీఎస్ కు తరలింపు
- ఎర్రవల్లి ఫాంహౌస్ ముట్టడి పేరుతో కాంగ్రెస్ శ్రేణులు సాగించిన అరాచకం
- కాంగ్రెస్ గూండాలను కేసీఆర్ నివాస ప్రాంగణం వరకు వెళ్లేందుకు అనుమతించిన పోలీసులు,
- తమ సొంత ఇంటికి తాము వెళ్తుంటే ఎందుకు అడ్డుకుంటున్నారో రాష్ట్ర డీజీపీ సమాధానం చెప్పాలి
- ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలయాపన
- ప్రతిపక్షాలను వేధించడంలోనే సీఎం రేవంత్ రెడ్డి పైశాచిక ఆనందం
- ప్రభుత్వం తన వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు డైవర్షన్ రాజకీయాలు
- ప్రజాస్వామ్యం ఎన్ని రకాలుగా పరిహాసమవుతుందో తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారు
- కేసీఆర్‌ను, బీఆర్ఎస్ నేతలను దూషించడానికే సభను వాడుకుంటున్నారు



**తొలి సమయం హైదరాబాద్**
మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై కాంగ్రెస్ గూండాలు కుట్రపూరితంగా హత్యాయత్నం చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. ఫాంహౌస్ కు వెళ్తున్న తమను అరెస్ట్ చేసి బోయిన్ పల్లి పీఎస్ కు తరలించగా.. ఆయన మీడియాతో మాట్లాడారు. ఎర్రవల్లి ఫాంహౌస్ ముట్టడి పేరుతో కాంగ్రెస్ శ్రేణులు సాగించిన అరాచకాన్ని ఆయన తీవ్రంగా తప్పుపట్టారు. కాంగ్రెస్ గూండాలను కేసీఆర్ నివాస ప్రాంగణం వరకు వెళ్లేందుకు అనుమతించిన పోలీసులు, తమ సొంత ఇంటికి తాము వెళ్తుంటే ఎందుకు అడ్డుకుంటున్నారో రాష్ట్ర డీజీపీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పోలీసులు కాంగ్రెస్ అరాచకాలను పట్టించుకోకుండా, కేవలం బీఆర్ఎస్ నాయకులనే లక్ష్యంగా చేసుకుని పనిచేస్తున్నారని మండిపడ్డారు.

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తూ, ప్రతిపక్షాలను వేధించడంలోనే సీఎం రేవంత్ రెడ్డి పైశాచిక ఆనందం పొందుతున్నారని కేటీఆర్ విమర్శించారు. ప్రభుత్వం తన వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు డైవర్షన్ రాజకీయాలకు తెరలేపిందని దుయ్యబట్టారు. "డైవర్షన్, డిస్ట్రక్షన్, డిస్ట్రాక్షన్" తప్ప రేవంత్ రెడ్డికి మరొక విద్య తెలియదని.. ఈ ప్రభుత్వం బుద్ధిహీన, సర్వభ్రష్ట ప్రభుత్వమని దుయ్యబట్టారు. అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన ఈ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పేంతవరకు బీఆర్ఎస్ వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేశారు ప్రజాస్వామ్యం ఎన్ని రకాలుగా పరిహాసమవుతుందో తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. కేసీఆర్‌ను, బీఆర్ఎస్ నేతలను దూషించడానికే సభను వాడుకుం టున్నారని.. దీనికోసం ప్రత్యేకంగా ఒక రోజు కేటాయించుకుని, మిగిలిన వారం రోజులైనా ప్రజా సమస్యలపై మాట్లాడాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దళితులపై నిజంగానే ప్రేమ ఉంటే వెంటనే దళిత, గిరిజన డిక్లరేషన్ హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

## ప్రిన్సిపల్ దామా జయచంద్రకు ఘన సన్మానం సీఎం చేతుల మీదుగా అవార్డు ప్రధానం





**తొలి సమయం పెబ్బేరు సెప్టెంబర్ 8**

ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ దామ జయచంద్ర గారు రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయు అవార్డుకు ఎన్నికై ఈనెల 5వ తేదీన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు శ్రీ రేవంత్ రెడ్డి గారి చేతుల మీదుగా రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకోవడం జరిగింది. విద్యార్థుల విద్యాభివృద్ధికి, ఉత్తమ బోధనకు, విద్యా రంగంలో విశేష సేవలు అందించిన శ్రీ దామ జయచంద్ర గారికి రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డువచ్చిన సందర్భంగా, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది ఆధ్వర్యంలో శాలువా మరియు బొకేలతో ఘనంగా సన్మానించడం జరిగింది. విద్యార్థుల విద్యాభివృద్ధికి, ఉత్తమ బోధనకు, విద్యా రంగంలో విశేష సేవలు అందించిన శ్రీ దామ జయచంద్ర గారు ఉపాధ్యాయ దినోత్సవం రోజున రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడు గా ఎంపిక కావడం గర్వ కారణం.ఈ సన్మానం తనకు మరింత బాధ్యతను, ఉత్సాహాన్ని కలిగించిందని జయచంద్ర తెలిపారు. విద్యార్థుల ఉన్నత భవిష్యత్తు కోసం మరింత అంకితభావంతో పనిచేస్తానని అన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది మరియు విద్యార్థినిలు పాల్గొన్నారు

## మోడల్ స్కూల్ పెబ్బేర్ లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం





**తొలి సమయం పెబ్బేరు సెప్టెంబర్ 7**

ఈరోజు తెలంగాణ మోడల్ స్కూల్ పెబ్బేర్ లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ జయచంద్ర పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ జీవితంలో ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొని తాను ఈ ఉపాధ్యాయ వృత్తిని చేపట్టానని పేదరికాన్ని సామాజిక అసమానతలను దూరం చేసే సరైన సాధనం చదువే అని ఆయన చెప్పారు. మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ తూర్పింటి నరేశ్ కుమార్ మాట్లాడుతూ... ప్రతి విద్యార్థి జీవితాన్ని నిర్దేశించే గురువును గుర్తుంచుకోవాలని గౌరవించాలని జీవితంలో ఏ స్థాయికి ఎదిగినా గురువును గౌరవించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం మరియు నాన్ టీచింగ్ స్టాఫ్ పాల్గొన్నారు.

## భూ సర్వే పారదర్శకంగా, పక్కాగా సాగాలి

**జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**



**తొలి సమయం; కేసముద్రం/ (మహబూబాబాద్), సెప్టెంబర్ 8:**

మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం ఉప్పరపల్లి గ్రామ పరిధిలోని చెరువుముందు తండాలో కొనసాగుతున్న సమగ్ర భూ సర్వే ప్రక్రియను జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా సర్వే బృందాలు నిర్వహిస్తున్న రోవర్ల వినియోగం,హద్దుల గుర్తింపు, డిజిటల్ మ్యాపింగ్ ప్రక్రియను ఆమె నిశితంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ సరిహద్దు వివాదాలకు తావులేకుండా భూ యజమానుల సమక్షంలోనే ఖచ్చితమైన కొలతలు నిర్వహించాలన్నారు.సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుంటూ రికార్డులను పక్కాగా,పారదర్శకంగా నమోదు చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో తహశీల్దార్ వివేక్, సర్వేయర్లు, జి.పి ఓ నర్మద, గ్రామ పంచాయతీ సిబ్బంది మరియు స్థానిక రైతులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ తాత మధుపై అనర్హత వేటు వేయాలి: తిప్పర్తి శ్రీధర్

**తొలి సమయం మహబూబాబాద్ సెప్టెంబర్ 8**

శాసన సభ పతి ఎమ్మెల్సీ తాత మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ టీపీసీసీ ఎస్సీ విభాగం పిలుపు మేరకు మాజీ ముఖ్య మంత్రి కేసీఆర్ ఎర్రవల్లి ఫామ్ హౌస్ ముట్టడి,1000 డప్పుల దరువు కు శాంతి యుత నిరసన కు మహబూబాబాద్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు తిప్పర్తి శ్రీధర్, తరలి వెళ్లారు ఫామ్ హౌస్ దగ్గర నాయకులను అరెస్టు చేసి సిద్దిపేట జిల్లా జగదేవపూర్ మండల పోలీస్ స్టేషన్ కి తరలించారు ,ఈ సందర్భంలో డప్పులతో పోలీస్ స్టేషన్ లో నే డప్పులతో నిరసన కొనసాగించారు, ఈ సందర్భంలో పోలీసుల తోపులాటలో స్వల్ప గాయాలు అయ్యాయి,సొంత పూచీకత్తు పై విడుదల చేశారు ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ ...సభ్య సమాజం తలదించుకునేలా ఉన్న ఈ వ్యాఖ్యలు ప్రజాస్వామ్య విలువలకు, శాసన వ్యవస్థ గౌరవానికి విరుద్ధమని ఆయన పేర్కొన్నారు.శాసనసభ స్పీకర్ పదవి




అత్యంత గౌరవప్రదమైనదని ఆ పదవిలో ఉన్న వ్యక్తిపై కులపరమైన లేదా అవమానకర వ్యాఖ్యలు చేయడం ఏమాత్రం సమర్థనీయం కాదని శ్రీధర్ అన్నారు బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న ఎమ్మెల్సీ తాత మధు తన వ్యాఖ్యలకు తక్షణమే క్షమాపణ చెప్పాలని పదవి నుండి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు ఇలాంటి వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణించి, శాసన మండలి నిబంధనల ప్రకారం తాత మధుపై కఠిన చర్యలు తీసుకోవాలని, కోరారు దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించమని ఆయన స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో భిన్నాభిప్రాయాలకు స్థానం ఉన్నప్పటికీ, వ్యక్తిగత అవమానాలు, కుల వివక్షకు తావులేదన్నారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి శేషం కిరణ్,మీసాల సురేష్,పడిశాల జాన్,అమర్,వినీత్ తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా “గురువందన - ఛాత్ర అభినందన & స్ఫూర్తి పురస్కార్--2026”

**ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 15 మంది ఉపాధ్యాయులకు ఘన సన్మానం చేసిన భారత్ వికాస్ పరిషత్..**

**తొలి సమయం మహబూబాబాద్ సెప్టెంబర్ 8**

భారత్ వికాస్ పరిషత్, మానుకోట శాఖ ఆధ్వర్యంలో గురువందన -- ఛాత్ర అభినందన ఒ స్ఫూర్తి పురస్కార్--2026” కార్యక్రమం ఆదివారం బ్రహ్మకుమారీస్ హాల్, మహబూబాబాద్లో అత్యంత ఘనంగా నిర్వహించారు. భారతీయ సంస్కృతిలో గురువుకు ఉన్న అత్యున్నత స్థానాన్ని భావితరాలకు తెలియజేయడం, విద్యార్థుల్లో గురువుల పట్ల గౌరవభావాన్ని పెంపొందించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం అని నివాహకులు తెలిపారు విద్యారంగంలో ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల విద్యాధికారి ఆరుద్ర వెంకటేశ్వర్లు ప్రత్యేక అతిథిగా రాజయోగిని బ్రహ్మకుమారి సుజాత హాజరై కార్యక్రమానికి ప్రత్యేక శోభను చేకూర్చారు. ఈ సందర్భంగా మహబూబాబాద్ పరిధిలోని ప్రభుత్వ మరియు ప్రైవేట్ పాఠశాలలకు చెందిన మొత్తం 15 మంది ఉపాధ్యాయులను, విద్యారంగంలో వారు అందిస్తున్న విశిష్ట సేవలకు గుర్తింపుగా లి“స్ఫూర్తి



పురస్కార్--2026”లితో ఘనంగా సత్కరించారు. శాలువాలు కప్పి, సన్మాన పత్రాలు అందజేసి వారి సేవలను అభినందించారు.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, “గురువు కేవలం పాఠాలు బోధించే వ్యక్తి మాత్రమే కాదు... విద్యార్థిలోని ప్రతిభను గుర్తించి, జ్ఞానంతో పాటు సంస్కారాన్ని అందించి, జీవితానికి సరైన దిశను చూపే మార్గదర్శి” అని పేర్కొన్నారు. గురువులను గౌరవించడం అంటే జ్ఞానాన్ని, విలువలను, సమాజ నిర్మాణంలో వారి అమూల్యమైన సేవలను గౌరవించడమేనని తెలిపారు.కార్యక్రమంలో భారత్ వికాస్ పరిషత్ మానుకోట శాఖ అధ్యక్షులు వొబిలిశెట్టి రామకృష్ణ, కార్యదర్శి జయప్రకాశ్ లోయ, కోశాధికారి రేణుకుంట్ల గణేష్‌కృష్ణ, ప్రభాకర్ రెడ్డి -- సౌత్ రీజియన్ ఎన్విరాన్మెంట్ కన్వీనర్, నాగేందర్ -- ప్రాంత ఉపాధ్యక్షులు, భూపాల్ రెడ్డి, ఆవుల శ్రీనివాస్, కార్యక్రమ కన్వీనర్ లెనిన్ బాబు, విజయ్ తదితరులు పాల్గొన్నారు. భారత్ వికాస్ పరిషత్ సభ్యులు మరియు కార్యక్రమానికి హాజరైన ప్రతి ఒక్కరికీ నిర్వాహకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్

**తొలి సమయం; కేసముద్రం/ (మహబూబాబాద్), సెప్టెంబర్ 8:**

మంగళవారం జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ కేసముద్రం మండలంలోని కోరుకొండపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ పాఠశాలలో విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్,మధ్యాహ్న భోజన పథకం అమలు,మరుగుదొడ్లు,త్రాగునీటి సౌకర్యం, తరగతి గదుల పరిశుభ్రతను పరిశీలించారు. విద్యార్థులకు యూనిఫారాల పంపిణీని,పాఠ్యపుస్తకాలను సకాలంలో పంపిణీ చేయాలని అన్నారు.విద్యార్థులతో మాట్లాడి వారి చదువు సామర్థ్యాన్ని అడిగి తెలుసుకున్నారు.విద్యార్థుల్లో సృజనాత్మకత, విమర్శనాత్మక ఆలోచన పెంపొందించేందుకు మెలకువలతో విద్యాబోధన అవసరమని అన్నారు.పాఠ్యపుస్తకాల్లోని అంశాలను బట్టీ పట్టించడం కాకుండా, నిత్యజీవిత ఉదాహరణలతో, కథలు,ఆటలతో బోధించాలని



అన్నారు.మధ్యాహ్న భోజనం నాణ్యతగా,పరిశుభ్రంగా ఉండాలని, ప్రతి విద్యార్థికి పోషకాహారం అందేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని,విద్యా ప్రమాణాలు మెరుగుపరి చేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. హాజరు శాతం పెంచేందుకు తల్లిదండ్రులలో అవగాహన కల్పించాలని ఎంఈఓ కి సూచించారు.మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని అంగన్ వాడీ కేంద్రాన్ని పరిశీలించి అంగన్ వాడీ కేంద్రంలో చిన్నారుల హాజరు,పోషకాహార నిల్వలు,నాణ్యత,మధ్యాహ్న భోజనం మరియు బాలామృతం పంపిణీ తీరు,పాఠశాల,అంగన్ వాడీ రికార్డుల నిర్వహణ,పరిశుభ్రత,త్రాగునీటి సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు.ప్రాథమిక స్థాయి నుండే పిల్లలకు నాణ్యమైన విద్య,పౌష్టికాహారం అందాలని, అంగన్ వాడీ,ప్రాథమిక పాఠశాల సమన్వయంతో పనిచేయాలని సూచించారు.తక్కువ బరువు గల చిన్నారులను గుర్తించి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, పాఠశాల ఆవరణను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను,సిబ్బందిని ఆదేశిం చారు.ఈ తనిఖీలో స్థానిక తహశీల్దార్ వివేక్, మండల విద్యాధికారి యాదగిరి ,పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజన్న, ఉపాధ్యాయులు,అంగన్ వాడీ సిబ్బంది, పాల్గొన్నారు.

## శాసన మండలి నుంచి తాతా మధును తక్షణమే సస్పెండ్ చేయాలి

- **కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సమ్మిగౌడ్ డిమాండ్.**
- **స్పీకర్ పై వ్యాఖ్యలు జుగుప్సాకరం**

**కాంగ్రెస్ పార్టీ ముఖ్యనాయకులు**

- **కాంగ్రెస్ మండల పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన**

**తొలి సమయం; కేసముద్రం/ (మహబూబాబాద్), సెప్టెంబర్ 8:**

తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పై అసభ్యకరమైన వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధును శాసన మండలి సభ్యత్వాని నుండి తక్షణమే సస్పెండ్ చేయాలని కేసముద్రం మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు సమ్మిగౌడ్ డిమాండ్ చేశారు.కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కేసముద్రం మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్లో కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు భారీ నిరసన నిర్వహించారు.??ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు నల్ల బ్యాడ్జీలు ధరించి తమ నిరసనను వ్యక్తం చేశారు.స్పీకర్ పదవికి, దళిత సమాజానికి వ్యతిరేకంగా మాట్లాడటం రాజ్యాంగ విలువలను తీవ్రంగా అవమానించడమేనని నినాదాలు చేశారు. అనంతరం సీనియర్ నాయకులు మాట్లాడుతూ... తాతామధును వెంటనే శాసనమండలి నుండి భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షులు సమ్మిగౌడ్ మాట్లాడుతూ.. .ఉన్నతమైన రాజ్యాంగ పదవిలో ఉన్న స్పీకర్‌ను ఉద్దేశించి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు మాట్లాడిన తీరు అత్యంత హేయమైనదన్నారు.రాజ్యాంగ వ్యవస్థలను,ప్రజాస్వామ్య పద్ధతులను కించపరిచే హక్కు ఎవరికీ లేదని తెలిపారు.తాతా మధుపై తక్షణమే అనర్హత వేటు వేసి,శాసన మండలి నుండి బర్తరఫ్ చేయాలని



డిమాండ్ చేశారు.చట్టపరంగా ఆయనపై కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.ప్రజాస్వామ్య వ్యవస్థలో స్పీకర్ స్థానానికి ప్రత్యేక గౌరవం ఉంటుందని,అలాంటి పదవిలో ఉన్న దళిత నేతపై అనుచిత వ్యాఖ్యలు చేయడం క్షమించరాని నేరమని స్థానిక కాంగ్రెస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ పదవికి తాతా మధు అనర్హుడని,ఆయన వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో అంబటి మహేందర్ రెడ్డి,అల్లం నాగేశ్వరరావు,రావుల మురళి,బండారు వెంకన్న, కదిర సురేందర్,వల్లందాసు రవి, తరాల వీరేష్,రాంబాబు,రడెం వెంకన్న,రడం శ్రీనివాస్,పోలెపాక నాగరాజు,యాదగిరి,ఆయూబ్ ఖాన్,శ్రీహరి,దామరకోండ ప్రవీణ్,సామల నరసయ్య,కొలిపాక వెంకన్న, కొండేటి కళాధర్,నూకల వెంకటేశ్వర్లు,తండ సంపత్, వివిధ గ్రామాల సర్పంచ్ లు,గ్రామ పార్టీ అధ్యక్షులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## కేసముద్రంలో ఘనంగా నూతన గృహప్రవేశ వేడుక...

**హాజరైన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సమ్మిగౌడ్...**



**తొలి సమయ మహబూబాబాద్/? కేసముద్రం సెప్టెంబర్ 8**

మున్సిపాలిటీ పరిధిలో నూతన గృహప్రవేశ వేడుక అత్యంత వైభవంగా జరిగింది. ఈ వేడుకకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సమ్మిగౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గృహప్రవేశం చేసిన తెరాల శ్యామ్, స్వాతి దంపతులు ప్రత్యేక ఆహ్వానం మేరకు విచ్చేసిన సమ్మిగౌడ్‌కు సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సమ్మిగౌడ్ నూతన దంపతులకు నూతన వస్త్రాలు అందజేసి, శాలువాతో సన్మానించి ఘనంగా శుభాకాంక్షలు తెలిపారు. కొత్త ఇంటిలోకి అడుగుపెట్టిన ఈ దంపతులు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

?ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రముఖులు, కుటుంబ సభ్యులు మరియు బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని దంపతులకు అభినందనలు తెలిపారు.వీరి వెంట దామరకొండ ప్రవీణ్, శ్రీనివాస్ రెడ్డి ఉన్నారు.

## జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలకు ఖమ్మం జిల్లా క్రీడాకారుల ఎంపిక...

**ఖమ్మం జిల్లా ఒలంపిక్ ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్షులు పుట్టా శంకరయ్య..**



**తొలి సమయం డెస్క్ హైదరాబాద్ సెప్టెంబర్ 8**

హైదరాబాద్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్, కొల్లూరులో నిర్వహించిన జూనియర్ రాష్ట్ర స్థాయి ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌లో ఖమ్మం జిల్లా ఆర్చరీ క్రీడాకారులు అద్భుత ప్రతిభ కనబరిచి పతకాలు సాధించడంతో పాటు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు అని ఖమ్మం జిల్లా ఒలంపిక్ ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్షులు పుట్ట శంకరయ్య ఓ ప్రెస్ నోట్ ద్వారా తెలియ జేశారు ఈ సందర్భంగా ఆయన తెలియ జేసిన వివరాలు ఇలా ఉన్నాయి ఇండియన్ రౌండ్ బాలుర విభాగంలో కె. రామ్‌చరణ్ -- ప్రథమ స్థానంఇండియన్ రౌండ్ బాలికల విభాగంలో ఈ. అవంతిక -- తృతీయ స్థానం రికర్వ్ రౌండ్ బాలికల విభాగంలో బి. ఝాన్సిక -- ప్రథమ స్థానం కె. లోహిత శ్రీ -- తృతీయ స్థానం రాష్ట్ర స్థాయి పోటీల్లో ఖమ్మం జిల్లాకు పతకాలు సాధించి, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను ఖమ్మం జిల్లా ఆర్చరీ అసోసియేషన్ అభినందించింది. జాతీయ స్థాయి పోటీల్లో కూడా అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఖమ్మం జిల్లాకు, తెలంగాణ రాష్ట్రానికి మరింత పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆకాంక్షిస్తూ క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలియజేసింది.

## సెప్టెంబర్ 18న ఆదివాసీ ఆత్మఘోష మహాధర్నా

**కొత్తగూడలో కరపత్రాల ఆవిష్కరణ.. విజయవంతం చేయాలని తుడుం దెబ్బ పిలుపు**



**తొలి సమయం/కొత్తగూడ: (మహబూబాబాద్) 08 సెప్టెంబర్ 2026**

షెడ్యూల్డ్ తెగల (ఎస్టీ) జాబితా నుంచి లంబాడీలను తొలగించే అంశంపై ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 18న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించనున్న 'ఆదివాసీ ఆత్మఘోష మహాధర్నా'ను విజయవంతం చేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ నాయకులు పిలుపునిచ్చారు.మంగళవారం మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండల కేంద్రంలో ఆదివాసీ ఆత్మఘోష మహాధర్నాకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తుడుం దెబ్బ జాతీయ అధ్యక్షుడు వట్టం ఉపేందర్, జాతీయ ప్రధాన కార్యదర్శి రమణాల లక్ష్మయ్య మాట్లాడుతూ.. తెలంగాణలో ఆదివాసీలకు దక్కాల్సిన విద్య, ఉద్యోగ, రాజకీయ రిజర్వేషన్లపై అన్యాయం జరుగుతోందని ఆరోపించారు.

లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించే అంశంపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రత్యేక కమిషన్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కమిషన్ ఏర్పాటు చేసే వరకు ఆదివాసీలంతా ఐక్యంగా ఉద్యమించి తమ హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు.ఇందిరాపార్క్ వద్ద జరిగే మహాధర్నాకు ఆదివాసీ ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలు, ప్రజాస్వామ్యవాదులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తుడుం దెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర్క యాదగిరి, వట్టం కన్నయ్య, పూనెం సందీప్, కొత్తగూడ మండల అధ్యక్షుడు మల్లెల సారయ్య, మండల ప్రధాన కార్యదర్శి ఈసం వెంకన్న, బీజ్జ సందీప్, బుర్క శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు

# వినాయక నిమజ్జనోత్సవాన్ని విజయ వంతం కోసం అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి..

**శోభా యాత్ర సాగే ప్రధాన మార్గాల్లో, నిమజ్జనం జరిగే ప్రధాన ఘాట్ ల వద్ద పటిష్టమైన పోలీస్ బందోబస్త్ ఉండాలి**

**జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్.ఎస్పీ డాక్టర్ శబరిష్..**



తొలి సమయం మహబూబాబాద్, సెప్టెంబర్.08

జిల్లాలో వినాయక నిమజ్జన వేడుకలను అత్యంత వైభవంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు పటిష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్ తో కలిసి, వినాయక నిమజ్జన వేడుకలపై రెవెన్యూ, మున్సిపల్, విద్యుత్, పోలీస్ తదితర శాఖల ఉన్నతాధికారులతో నిమజ్జన ఏర్పాట్లపై సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించి, కీలక దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో శోభాయాత్ర సాగే ప్రధాన మార్గాల్లో, నిమజ్జన ఘాట్ల వద్ద పోలీస్ శాఖ పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు బలగాలను మోహరించి, సీసీటీవీ కెమెరాలు, డ్రోన్ల ద్వారా నిరంతర నిఘా ఉంచాలన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తుగా రూట్ డైవర్షన్ ప్రణాళికలు అమలు చేయాలన్నారు. విగ్రహాల ఊరేగింపు మార్గాల్లో రోడ్ల మరమ్మతులు, గుంతల పూడ్చివేత పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. నిమజ్జనం పూర్తయిన వెంటనే వ్యర్థాలను తొలగించేందుకు పారిశుధ్య కార్మికులను షిఫ్టుల వారీగా నియమించాలి. ఊరేగింపు మార్గాల్లో వేలాడుతున్న విద్యుత్ తీగలను సంబంధిత శాఖల వారు సరిచేసి, ఎత్తు పెంచాలన్నారు.విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా నిరంతర విద్యుత్‌తో పాటు ఘాట్ల వద్ద అదనపు జనరేటర్లు, హైమాస్ట్ లైట్లను సిద్ధంగా ఉంచాలన్నారు. విగ్రహాల నిమజ్జనానికి ఇబ్బంది కలగకుండా, క్రేన్లు సులభంగా నిలిచేందుకు మరియు విగ్రహాలు నీటిలో సరిగ్గా మునిగేందుకు నిమజ్జన పాయింట్ల వద్ద పూడిక తీత పనులు చేపట్టాలని అన్నారు.ఇరిగేషన్ అధికారులు నిమజ్జనం జరిగే చెరువులు, జలాశయాలు లేదా కాలువల్లో తగినంత నీటి మట్టం ఉందో లేదో పర్యవేక్షించి మండల అధికారులను సమన్వయం చేసుకొని నివేదికలు అందజేయాలని అన్నారు. ప్రమాదాలు జరగకుండా ఘాట్ల వద్ద బలమైన బారికేడింగ్, గజ ఈతగాళ్లు, బోట్లు, లైఫ్ జాకెట్లతో కూడిన ప్రత్యేక రెస్క్యూ టీమ్‌లను మోహరించాలన్నారు. అగ్నిమాపక శకటాలను (ఫైర్ ఇంజిన్లు) ఎల్లవేళలా అందుబాటులో ఉంచాలన్నారు.మండప నిర్వాహకులు, ప్రజలు అధికారులకు సహకరించి, పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని నిబంధనలకు అనుగుణంగా నిమజ్జనం పూర్తి చేయాలని అన్నారు. మండల స్థాయిలో తహసీల్దార్లు పంచాయతీ కార్యదర్శులు, గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశాలు నిర్వహించి అవసరమైన ఏర్పాట్లపై కార్యాచరణ రూపొందించాలన్నారు. అన్ని శాఖల అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించి వినాయక చవితి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆదేశించారు నిమజ్జనం పూర్తయిన తరువాత ఘాట్ల వద్ద, ప్రధాన రహదారులపై మున్సిపల్ మరియు పంచాయతీ సిబ్బంది సహాయంతో మట్టి, వ్యర్థాలు, పూజా సామగ్రిని తొలగించి శుభ్రపరిచే చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్ మాట్లాడుతూ వినాయక మండపాల నిర్వాహకులు పోలీస్ శాఖ వెబ్‌సైట్‌లో పూర్తి వివరాలను నమోదు చేసి అనుమతి పొందాలని సూచించారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోలేని వారు సంబంధిత పోలీస స్టేషన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనుమతులు పొందిన తర్వాతే మండపాలను ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యు అదనపు కలెక్టర్ కె.అనిల్ కుమార్, ఇంచార్జ్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పురుషోత్తం, డి.ఆర్.ఓ. నాగా వాణి, డి.ఆర్.డి.ఓ మధుసూధనరాజు, మహబూబాబాద్, తొర్రూరు ఆర్డీఒ లు రాజేశ్వరీ, గణేష్ ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నితీష్ కుమార్, మున్సిపల్ కమిషనర్లు, తహసిల్దార్లు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు

# స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు సిగ్గుచేటు

**తాతా మధు ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసి దళితులకు క్షమాపణ చెప్పాలి: కాంగ్రెస్ నాయకులు**



**తొలి సమయం/కొత్తగూడ, మహబూబాబాద్ 08 సెప్టెంబర్ 2026**

తెలంగాణ వర్షాకాల అసెంబ్లీ సమావేశాల ప్రారంభం రోజున బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వ్యవహరించిన తీరును నిరసిస్తూ మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బానోత్ రూప్ సింగ్ తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా బానోత్ రూప్ సింగ్ మాట్లాడుతూ.. దళిత సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి అత్యున్నతమైన స్పీకర్ పదవిలో కొనసాగడాన్ని బీఆర్ఎస్ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారని ఆరోపించారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తల్లి మృతిచెంది పుత్రశోకంలో ఉన్న సమయంలో ఆయన కుటుంబాన్ని ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేయడం బాధాకరమని అన్నారు.దళితుల పట్ల బీఆర్ఎస్ పార్టీకి మొదటి నుంచి వివక్షాపూరిత వైఖరి ఉందని నాయకులు విమర్శించారు. గతంలో దళితుడిని ఉప ముఖ్యమంత్రిగా నియమించి అవమానించిన ఘటనలు ఇందుకు నిదర్శనమని ఆరోపించారు. తాజాగా తాతా మధు చేసిన వ్యాఖ్యలు బీఆర్ఎస్ పార్టీ సంస్కృతిని ప్రతిబింబిస్తున్నాయని మండిపడ్డారు.తాతా మధు తక్షణమే తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసి, దళిత సమాజానికి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ ఘటనపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్పందించి ప్రజలకు వివరణ ఇవ్వడంతో పాటు క్షమాపణ చెప్పాలని కోరారు. లేనిపక్షంలో బీఆర్ఎస్ నాయకులను ప్రజలు, దళిత వర్గాలు ఎక్కడికక్కడ నిలదీస్తాయని హెచ్చరించారు.ఈ నిరసన ర్యాలీలో రాష్ట్ర పంచాయతీ డైరెక్టర్ చల్లా నారాయణ రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు వజ్జ సారయ్య, ఇర్ప రాజేశ్వర్, వెంకన్న, రాజం సారంగం, ఈర్య, సర్పంచ్ మల్లెల భాగ్యమ్మ, బాలరాజు, మల్లెల లక్ష్మణ్, ప్రశాంత్,కాంగ్రెస్ పార్టీ స్థానిక ప్రజాప్రతినిధులు, మండల ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రతి గడపకు కాంగ్రెస్ సంక్షేమ పథకాలు

**ఘనంగా ఎమ్మెల్యే కోరం కనకయ్య జన్మదిన వేడుకలు. అలరించిన జబర్దస్త్ టీం.**



**తొలి సమయం, ఇల్లందు;సెప్టెంబర్, 08:**

ఇల్లందు, తెలంగాణలో కాంగ్రెస్ ప్రజా పాలనలో సంక్షేమ పథకాలు ప్రతి గడపకు చేరుతున్నాయని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. మంగళవారం ఇల్లందులో నిర్వహించిన తన జన్మదిన వేడుకల్లో ఆయన మాట్లాడారు. పుట్టినరోజును సేవా కార్యక్రమాలతో జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. నియోజకవర్గం నలుమూలల నుంచి తరలివచ్చి శుభాకాంక్షలు తెలిపిన నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.జన్మదిన వేడుకల సందర్భంగా అభిమానుల ఆధ్వర్యంలో వెయ్యి మందికి పైగా అన్నదానం, యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం, ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పాలు, పండ్లు, బ్రెడ్ పంపిణీతో పాటు పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అనంతరం జబర్దస్త్ ఫేమ్ వినోద్, నవీన్, రాజు బృందం హాస్య స్కిట్లు, స్థానిక యాసలో పంచ్ డైలాగులతో అలరించింది. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల్లో పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రేషన్ కార్డులు, పెన్షన్లు, రైతులకు రుణమాఫీ, రైతు బీమా, రైతు భరోసా వంటి పథకాలు అమలు చేసిందని ఎమ్మెల్యే తెలిపారు. సంక్షేమ పథకాలను ప్రతి కార్యకర్త గడపగడపకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. అసెంబ్లీ గేట్ వద్ద స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలను ఎమ్మెల్యే ఖండించారు. స్పీకర్ పదవి శాసనసభ గౌరవానికి, ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రతీక అని అన్నారు.కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్, మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## చిన్నారులకు కానుకలు.. ఎమ్మెల్యే కోరం కనకయ్య జన్మదిన వేడుకలు.

**ఇతర సమయం, ఇల్లందు;సెప్టెంబర్, 08:**

ఇల్లందు,మండలంలోని ఇందిరానగర్ గ్రామపంచాయతీలో సర్పంచ్ పాయం లలిత అధ్యక్షతన ఎమ్మెల్యే కోరం కనకయ్య జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ చిన్నారులకు దుస్తులు, పెన్సిళ్లు, పలకలు పంపిణీ చేసి, సిబ్బందిని శాలువాలతో సన్మానించారు. అనంతరం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బెల్లంకొండ ఆదిత్య, వార్డు సభ్యులు ఊకే చుక్కమ్మ, బియ్యని సుదర్శన్, తోలెం రమాదేవి, గ్రామ శాఖ అధ్యక్షుడు వాలేపు ఎల్లయ్య, ప్రధాన కార్యదర్శి విశాలక్ష్మి, ఉపాధ్యక్షురాలు ముత్యాల లలిత, కార్యదర్శి వీరారెడ్డి, మైబీచెట్టి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.



# ఎన్టీఆర్ సినిమాలో అదిరిపోయే స్పెషల్ సాంగ్..

భారీ సెట్‌లో ఇద్దరు హీరోయిన్లతో మాస్ ట్రీట్!



యంగ్ టైగర్ ఎన్టీఆర్, దర్శకుడు ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న సినిమాపై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. 'డ్రాగన్' లేదా 'బ్రూస్ లీ' అనే వర్కింగ్ టైటిల్స్‌తో ప్రచారంలో ఉన్న ఈ సినిమా ఇప్పటికే భారీ హైప్‌ను సొంతం చేసుకుంది. 'కేజీఎఫ్', 'సలార్' వంటి సినిమాలతో తనదైన యాక్షన్ బ్రాండ్‌ను క్రియేట్ చేసుకున్న ప్రశాంత్ నీల్.. ఎన్టీఆర్‌ను ఎలా చూపించబోతున్నారనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది.ఇక ఈ సినిమాకు సంబంధించి తాజాగా ఓ క్రేజీ అప్‌డేట్ ఇండస్ట్రీ వర్గాల్లో వైరల్ అవుతోంది. సినిమా కోసం ఓ భారీ స్పెషల్ సాంగ్‌ను చిత్రీకరించేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. ఈ పాట కోసం ప్రత్యేకంగా భారీ సెట్‌ను నిర్మిస్తున్నట్లు తెలుస్తోంది.

ప్రశాంత్ నీల్ సినిమాల్లో యాక్షన్ సన్నివేశాలతో పాటు భారీ విజువల్స్‌కు కూడా ప్రత్యేక స్థానం ఉంటుంది. అదే తరహాలో ఎన్టీఆర్ సినిమాకు కూడా ఆయన స్పెషల్ సాంగ్‌ను భారీ స్థాయిలో డిజైన్ చేస్తున్నట్లు టాక్.ఈ పాట కోసం ప్రత్యేకంగా భారీ సెట్‌ను సిద్ధం చేస్తున్నారని తెలుస్తోంది. పాటలో కనిపించే విజువల్స్ ప్రేక్షకులకు థియేటర్‌లో మాస్ ట్రీట్ ఇచ్చే విధంగా ఉండబోతున్నాయని సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.సినిమా కథ, యాక్షన్‌తో పాటు ఈ పాట కూడా హైలైట్‌గా నిలిచేలా ప్రశాంత్ నీల్ ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. ఈ స్పెషల్ సాంగ్‌లో ఎన్టీఆర్‌తో పాటు సినిమాలో కథానాయికలుగా నటిస్తున్న రుక్మిణీ వసంత్, మరో హీరోయిన్ కూడా కలిసి స్టెప్పులు వేయనున్నట్లు టాక్ వినిపిస్తోంది.

ఎన్టీఆర్‌కు మాస్ డ్యాన్స్‌లో ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. దీంతో ప్రశాంత్ నీల్ మార్క్ మాస్ మేకింగ్‌కు ఎన్టీఆర్ డ్యాన్స్ జోడైతే ఈ పాట అభిమానులకు పండుగలా ఉంటుందని ఫ్యాన్స్ భావిస్తున్నారు.ముఖ్యంగా భారీ సెట్స్, గ్రాండ్ కొరియోగ్రఫీ, స్టార్ హీరోతో పాటు ఇద్దరు హీరోయిన్ల పెర్ఫార్మెన్స్‌తో ఈ సాంగ్‌ను ప్రత్యేక ఆకర్షణగా తీర్చిదిద్దుతున్నట్లు సమాచారం. ఎన్టీఆర్--ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ఈ చిత్రం మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్నట్లు ఇప్పటికే ప్రచారం జరుగుతోంది. ప్రశాంత్ నీల్ తన సినిమాల్లో యాక్షన్ సీక్వెన్స్‌లను అత్యంత భారీ స్థాయిలో తెరకెక్కిస్తారనే విషయం తెలిసిందే. ఈసారి ఎన్టీఆర్ ఇమేజ్‌కు తగ్గట్టుగా యాక్షన్‌ను మరింత పవర్‌ఫుల్‌గా డిజైన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. కథలోని యాక్షన్ ఎపిసోడ్స్, హీరో క్యారెక్టరైజేషన్, భారీ సెట్స్ సినిమాకు ప్రధాన బలాలుగా నిలుస్తాయని ఇండస్ట్రీ వర్గాల్లో టాక్.

# ఆడపిల్లలంటే ఆట వస్తువులు కాదు..

అలా చూపిస్తే ఒప్పుకోను..!

కాయదు లోహర్ షాకింగ్ కామెంట్స్




ప్రదీప్ రంగనాథన్ నటించిన 'డ్రాగన్' చిత్రంతో హీరోయిన్ కయాదు లోహర్ మంచి గుర్తింపు తెచ్చుకుంది. అంతకు ముందుకు ఈ అమ్మడు తెలుగులో అల్లూరి అనే సినిమా చేసింది. కానీ ఆ సినిమా పెద్దగా ఆకట్టుకుకోలేదు. ఇక ఈ చిన్నది ఫంకీ సినిమాతో మరోసారి తెలుగు ఆడియన్స్ ను ఆకట్టుకుంది. కానీ ఈ సినిమా అంతగా ఆకట్టుకోలేదు. ప్రస్తుతం ఆమె తమిళం, తెలుగు చిత్రసీమలలో చాలా బిజీగా ఉంది. సోషల్ మీడియాలోనూ ఈ ముద్దుగుమ్మ చాలా యాక్టివ్ గా ఉంటుంది. మరోవైపు తెలుగులోనూ బ్యాక్ టూ బ్యాక్ అవకాశాలు అందుకుంటుంది. ప్రస్తుతం నేచురల్ స్టార్ నాని నటిస్తున్న ది ప్యారడైజ్ సినిమాలో కాయదు హీరోయిన్ గా నటిస్తుంది. ఇదిలా ఉంటే తాజాగా కయాదు లోహర్ చేసిన కొన్ని కామెంట్స్ సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. సినిమాల్లో ఆడవాళ్లను చూపించే విధానంపై కయాదు లోహర్ ఆసక్తికర కామెంట్స్ చేశారు.

సినిమాల్లో మహిళలను కేవలం ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించే ఐటెమ్ లా చూపించే ధోరణిని తాను ఒప్పుకోనని తేల్చి చెప్పింది కాయదు. స్పష్టం చేశారు యంగ్ హీరోయిన్ కయాదు లోహర్. కథ, పాత్ర డిమాండ్ చేస్తే పరిమితులకు లోబడి నటించడానికి ఎలాంటి అభ్యంతరం లేదని, కేవలం లైమ్ లైట్ కోసమో లేదా సోషల్ మీడియాలో ట్రెండ్ అవ్వడానికో అసభ్యకరమైన సన్నివేశాల్లో నటించే ఆలోచన తనకు అస్సలు లేదని చెప్పుకొచ్చింది కయాదు లోహర్. ఈ కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి.

అస్సాంలో పుట్టి పెరిగినా దక్షిణాది సినిమా ఇండస్ట్రీలో సత్తా చాటుతోంది కాయదు లోహర్. తన అందం, అభినయంతో కుర్రకారులో క్రేజ్ తెచ్చుకుందీ ముద్దుగుమ్మ. మోడలింగ్ తో కెరీర్ మొదలు పెట్టిన కాయదు లోహర్. 'టైమ్స్ ఫ్రెష్ ఫేస్' పోటీల్లో విజేతగా నిలిచి అందరి దృష్టినీ ఆకర్షించిన కయాదు ఆ తర్వాత నటనారంగం వైపు అడుగులు వేశారు. కన్నడలో 'ముగిల్‌పేటే' చిత్రంతో కెరీర్ ప్రారంభించింది ఈ ముద్దుగుమ్మ ..

# 'ఇరుముడి' నుంచి 'కార్తీకమాసం' వీడియో సాంగ్ విడుదల!




మాస్ మహారాజా రవితేజ హీరోగా, శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కిన బ్లాక్‌బస్టర్ చిత్రం 'ఇరుముడి' నుంచి మరో క్రేజీ పాట విడుదలైంది. ఇప్పటికే "మల్లెపూల పల్లకి" వీడియో సాంగ్‌ను విడుదల చేసిన మేకర్స్ తాజాగా మరో పాటను వదిలారు. అయ్యప్ప స్వామి భక్తి దీక్ష విశిష్టతను, ఆధ్యాత్మిక పరివర్తనను అత్యంత హృద్యంగా ఆవిష్కరిస్తూ రూపొందించిన 'కార్తీకమాసం..' అంటూ సాగే పూర్తి వీడియో గీతాన్ని చిత్ర యూనిట్ తాజాగా విడుదల చేసింది. ప్రస్తుతం ఈ పాట సోషల్ మీడియాలో ఆధ్యాత్మిక ప్రియులను, ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంటోంది. ఈ చిత్రంలో రవితేజ పాత్రలో వచ్చే భావోద్వేగాలు, జీవితంలో అలవాటైన చెడు వ్యసనాలను పూర్తిగా మానుకొని, కఠినమైన అయ్యప్ప దీక్షను భక్తిశ్రద్ధలతో ఎలా కొనసాగించారనే పట్టుదలను ఈ పాటలో దర్శకుడు చాలా చక్కగా చూపించారు. ఒక వ్యక్తి తన అంతరాత్మతో పోరాడుతూ ఆధ్యాత్మిక మార్గం వైపు అడుగులు వేసే ప్రయాణానికి ఈ పాట అద్దం పడుతోంది. సినిమాలోని కథాబలానికి ఈ గీతం ప్రధాన ఆకర్షణగా నిలవనుందని తాజా వీడియో చూస్తే స్పష్టమవుతోంది.

సంగీత దర్శకుడు జీవీ ప్రకాశ్‌కుమార్ అందించిన బాణీలు ఈ పాటకు ప్రాణం పోశాయి. హృదయానికి హత్తుకునేలా ఉన్న ట్యూన్స్‌తో పాటు, ఈ పాటకు స్వయంగా దర్శకుడు శివ నిర్వాణ అందించిన సాహిత్యం మరో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భక్తి భావాలతో పాటు జీవిత సత్యాలను ప్రతిబింబించేలా ఉన్న ఈ పదాలు శ్రోతలను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. రవితేజ నటన, జీవీ ప్రకాష్ సంగీతం, శివ నిర్వాణ సాహిత్యం-దర్శకత్వం అన్నీ కలిసి ఈ పాన్ని ఒక మ్యూజికల్ మాస్టర్‌పీస్‌గా మలిచాయి.

# మహిళా ప్రజాప్రతినిధులపై దాడులను నిరసిస్తూ బీఆర్ఎస్ వినూత్న నిరసన

**తొలి సమయం, ఇల్లందు;సెప్టెంబర్, 08:** ఇల్లందు, మహిళా ప్రజాప్రతినిధులను గౌరవించలేని రేవంత్ సర్కార్ వెంటనే గద్దె దిగాలని మాజీ ఎమ్మెల్యే, ఇల్లందు నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి బానోత్ హరిప్రియ నాయక్ డిమాండ్ చేశారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా బీఆర్ఎస్ మహిళా ప్రజాప్రతినిధులపై పోలీసులు వ్యవహరించిన తీరును నిరసిస్తూ మంగళవారం ఇల్లందు పట్టణంలోని జగదాంబ సెంటర్--తెలంగాణ తల్లి చౌరస్తా వద్ద బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హరిప్రియ నాయక్‌తో పాటు బీఆర్ఎస్ వ్యవస్థాపక సభ్యుడు దిండిగాల రాజేందర్, మహిళా విభాగం నాయకురాళ్లు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లి"రేవంత్‌రెడ్డి--చావు కుండ"లిను పగలకొట్టి వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా హరిప్రియ నాయక్ మాట్లాడుతూ.. తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం, మహిళలకు పూర్తి గౌరవం ఇస్తున్నామని చెప్పే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనలో మహిళా ప్రజాప్రతినిధుల పట్ల జరిగిన ఘటనలు ఇందుకు పూర్తి విరుద్ధంగా ఉన్నాయని విమర్శించారు. ప్రజలచే రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన మహిళా ప్రజాప్రతినిధుల పట్ల పోలీసులు వ్యవహరించిన




తీరుపై ముఖ్యమంత్రి కనీసం విచారణకు ఆదేశించకపోవడం బాధాకరమన్నారు. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డిల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరును తీవ్రంగా ఖండించారు. మహిళా ప్రజాప్రతినిధులకే రక్షణ



లేకపోతే సామాన్య మహిళల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. అసెంబ్లీ వేదికగా మహిళలను అవమానించే విధంగా వ్యవహరించిన కాంగ్రెస్ ప్రభుత్వానికి రానున్న రోజుల్లో మహిళలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. దిండిగాల రాజేందర్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలతోనే పోలీసుల జులుం కొనసాగుతోందని ఆరోపించారు. మహిళలంటే ముఖ్యమంత్రికి గౌరవం లేదని విమర్శించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులపై దాడులకు ప్రభుత్వం వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. నిరంకుశ, కుట్రపూరిత రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారని, రానున్న రోజుల్లో ప్రజలు, ముఖ్యంగా మహిళలు కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన సమాధానం చెబుతారని బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, మహిళా విభాగం నాయకురాళ్లు, మాజీ ప్రజాప్రతినిధులు, కీలక నేతలు, కార్యకర్తలు, యువజన విభాగం, అనుబంధ సంఘాల ప్రతినిధులు, సోషల్ మీడియా విభాగం సభ్యులు, అభిమానులు పాల్గొన్నారు.

PUBLICATIONS AND PRINTERING BY VEMULA AYODHYA RAMULU, H-NO 1-6-155/43/45/4 NANDI NAGAR POST: MANDAL DIST: MAHABUBABAD TELANGANA STATE INDIA PIN CODE 506101, TELTEL NO 12283, PHONE NUMBER 9000689544...